
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జనగామ
బుధవారం 29 అక్టోబరు 2025


జనగామలో తుఫాన్ ప్రభావంతో కమ్ముకున్న మేఘాలు

- రైతులను కలవరపెడుతున్న తుఫాన్
- 'మొంథా' హెచ్చరికలతో ఆందోళన
- చేతికొచ్చిన పత్తి, వరి, మొక్కజొన్న పంటలు
- వర్షాలు పడితే తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం
- అప్రమత్తమవుతున్న రైతులు.. పచ్చిమీదనే వరి కోతలు
- సుమారు 2లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పంట, రైతుల వద్దే..
- జిల్లాలో 2.15 లక్షల ఎకరాల్లో వరి సాగు
- 1.37లక్షల ఎకరాల్లో పత్తి.. 5,430 ఎకరాల్లో మొక్కజొన్న సాగు..



మొంథా చింత!

జనగామ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ భయం జిల్లా రైతులను వెంటాడుతోంది. అధికారులు తుఫాన్ హెచ్చరికలు జారీ చేయడంతో ఆందోళన చెందుతున్నారు. వరి, పత్తి, మొక్కజొన్న పంటలు చేతికి వచ్చాయి. కొన్ని ప్రాంతాల్లో వరి, మొక్కజొన్న కోత, పత్తి తీతలు ప్రారంభమయ్యాయి. మరికొన్ని ప్రాంతాల్లో వరి ఇంకా కోత దశలోనే ఉంది. పత్తి తీత దశకు చేరింది. ఈ తరుణంలో తుఫాన్ ముంచుకొస్తుండడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడ్డ 'మొంథా' తుఫాన్ తీరం వైపు వేగంగా దూసుకొస్తుండడంతో జిల్లావాసుల్లో ఆందోళన మొదలైంది. తుఫాన్ నేపథ్యంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు మరింత కలవరపెడుతున్నాయి. జిల్లావ్యాప్తంగా వానాకాలం సీజన్‌లో 2.15 లక్షల ఎకరాల్లో వరి, 1.37 లక్షల ఎకరాల్లో పత్తి, 5430 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగైంది.


కోత దశలో వరి

మారిన వాతావరణం

మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లావ్యాప్తంగా వాతావరణం మారిపోయింది. రెండు రోజుల నుంచి ఉష్ణోగ్రత చల్లబడింది. సోమవారం వరకు సాధారణ ఉష్ణోగ్రతలు నమోదు కాగా మంగళవారం వాతావరణం పూర్తిగా చల్లబడింది. దీంతోపాటు చల్లని గాలులు వీస్తున్నాయి. మంగళవారం ఉదయం నుంచి జిల్లాలో పలు చోట్ల అప్పుడప్పుడు చిరు జల్లులు కురుస్తున్నాయి. మొంథా తుఫాన్ ప్రభావం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపైనే ప్రభావం చూపించే అవకాశం ఉందని చెబుతున్నా ఏ సమయంలో ఎటు దిశను మార్చుకుంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. తుఫాన్ ప్రభావం జిల్లాపై ఎక్కువగా చూపితే భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

వర్షాలు పడితే పంటలకు నష్టం

తుఫాన్ ఎఫెక్ట్ జిల్లాపై ఎక్కువగా ఉంటే పత్తి, వరి, మొక్కజొన్నకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదముంది. జిల్లాలో వరి కోతలు అంతంతమాత్రంగానే ప్రారంభమయ్యాయి. నీటి ఎద్దడి కారణంగా జిల్లాలో వానాకాలం సీజన్‌లో వరి సాగు ఆలస్యంగా ప్రారంభమైంది. అక్టోబరు చివరి వారం వరకు దాదాపు కోతలు పూర్తి కావాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 50 శాతం కోతలు కూడా జరగలేదు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వడ్లను తెచ్చిన రైతులు సైతం ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 102 సన్నరకం, 181 దొడ్డురకం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు కేవలం 7,209 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొన్నారు. ఇంకా (మిగతా 8వ పేజీలో)

ఆరోగ్యంతోనే విద్యాభివృద్ధి

- విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు హెల్త్ కార్డులు దోహదం
- ఉత్తమ ఫలితాల సాధనకు ప్రణాళికబద్ధంగా చదవాలి
- కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా
- కేజీబీవీ విద్యార్థులకు ట్రంక్ పెట్టెల పంపిణీ


విద్యార్థులకు ట్రంక్ బాక్సులను అందజేస్తున్న కలెక్టర్

లింగాలఘణపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్యమే విద్యాభివృద్ధికి దోహదపడుతుందని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా తెలిపారు. మంగళవారం లింగాలఘణపురం మండలం బండ్లగూడెం కేజీబీవీ విద్యార్థుల కోసం జేఎన్‌టీయూ అందించిన ట్రంక్ బాక్సుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వం ఉన్నతమైన చదువుతో పాటుగా పౌష్టికాహారాన్ని అందిస్తోందని వెల్లడించారు. పరీక్షలు సమీపిస్తున్నందున పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలన్నారు. దిక్సూచి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులందరికీ హెల్త్‌కార్డులను అందజేయడం జరుగుతుందని హెల్త్‌కార్డుల్లో నమోదు చేసిన వైద్యపరీక్షలన్నీ వైద్యాధికారులు చేస్తారన్నారు. విద్యార్థులు తమ హెల్త్ స్టేటస్‌ను తల్లిదండ్రులకు కూడా వివరించాలని కలెక్టర్ సూచించారు. కేజీబీవీల విద్యార్థులకు జేఎన్‌టీయూ సౌజన్యంతో రూ.40లక్షల విలువైన 4వేల ట్రంక్ బాక్సులను అందజేయడం జరుగుతుందన్నారు. వీటికోసం మహాత్మాహెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు గంటరవీందర్ చేయూత, జీసీడీవో గౌసియాబేగం కృషి అభినందనీయమన్నారు. జీసీడీవో గౌసియా బేగం, మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు గంటా రవీందర్, తహసిల్దార్ రవీందర్, స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణ, ఎంఈవో విష్ణుమూర్తి, ఎంపీవో రఘురామకృష్ణ పాల్గొన్నారు.

ఎన్‌పీడీసీఎల్‌కు ప్రతిష్ఠాత్మకమైన సర్టిఫికెట్లు

7 ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ఐ క్రీడా ఎంపిక పోటీలు

క్రికెట్ స్టేడియం నిర్మించాలి

- ఉనికిచర్లలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయాలి
- స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి..
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- టూరిజం కల్చర్ అండ్ స్పోర్ట్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీతోపాటు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వీసీఅండ్ ఎండీకి వినతి

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలోని ఉనికిచర్లలో ఎన్‌హెచ్ 163 ఆనుకొని ఉన్న స్థలంలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రికెట్ స్టేడియాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి, యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం కల్చర్ అండ్ స్పోర్ట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వీసీ అండ్ ఎండీ సోని బాలదేవిలను హైదరాబాద్‌లోని సచివాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ జేఎన్ఎస్ స్టేడియంలో తాత్కాలిక ప్రాతిపదికన స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటుకు అవసరమైన అన్ని వసతులు ఉన్నాయని, క్రీడాకారులకు ఇండోర్, అవుట్ డోర్ క్రీడా మైదానాలు, ట్రాక్స్, హాస్టల్ వసతికి అవసరమైన మరమ్మతులు కూడా పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఆలస్యం చేయకుండా స్పోర్ట్స్ స్కూల్ ప్రారంభించేందుకు ప్రభుత్వపరమైన అనుమతులు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. స్పందించిన అధికారులు జేఎన్ఎస్‌లో తాత్కాలిక ప్రాతిపదికన స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటుకు నవంబరు 14లోపు అనుమతులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కడియం తెలిపారు. క్రికెట్ స్టేడియం నిర్మాణానికి హన్మకొండ జిల్లా కలెక్టర్‌ను ఫీజుబులిటీ రిపోర్ట్, స్థల సేకరణకు సంబంధించిన రిపోర్టులు ఇచ్చేలా ఆదేశించినట్లు తెలిపామని, రిపోర్టులు రాగానే స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

ఆలయాలను అభివృద్ధి చేయండి..

- చిల్పూర్, జీడికల్ గుళ్లకు రూ.10కోట్లు కేటాయించాలి
- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఎమ్మెల్యే కడియం శ్రీహరి వినతి

7లో


సూరింటెండెంట్ డాక్టర్ హరీష్ చంద్రారెడ్డి

ఎంజీఎంకు కొత్త బాస్

సూరింటెండెంట్‌గా డాక్టర్ పి.హరీష్ చంద్రారెడ్డి

వివరాలు 8వ పేజీలో

హైనా దాడిలో దూడ మృతి

- స్థానికుల్లో భయాందోళనలు
- తిమ్మాపూర్‌లో ఘటన


చనిపోయిన దూడను పరిశీలిస్తున్న అధికారులు

జఫర్‌గడ్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : తిమ్మాపూర్ శివారులో సోమవారం రాత్రి దూడపై హైనా దాడి చేసి చంపడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. తిమ్మాపూర్‌లో ఎర్ర నాగలక్ష్మి అనే మహిళా రైతు బర్రె, దూడను సోమవారం రాత్రి గ్రామ చివరగల వ్యవసాయ క్షేత్రంలో కట్టేసి ఇంటికి వచ్చింది. మంగళవారం ఉదయం బర్రె పాలు పితకడం కోసం వెళ్లగా దూడ చనిపోయి కనిపించింది. సమాచారం అందుకున్న అటవీ శాఖాధికారులు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని చేరుకుని పరిశీలించారు. చుట్టూ పరిసర ప్రాంతాలను పరిశీలించిన అధికారులు హైనా దాడిగా గుర్తించారు. పశువైద్యాధికారి రజిత పంచనామా నిర్వహించారు.

రైతులు తమ పశువులు, దూడల రక్షణలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఫారెస్ట్ రేంజ్ ఇన్‌చార్జి ఆఫీసర్ కొండల్‌రెడ్డి సూచించారు. కొద్ది రోజులు తమ పశువులు, దూడలను గ్రామ చివర వ్యవసాయ క్షేత్రాల వద్ద కట్టేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ జరీనా, బీట్ ఆఫీసర్ అంజయ్య, వాచర్లు మోహన్ నాయక్, సంతోష్ ఉన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాల తనిఖీ

జనగామ కల్చరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జనగామలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను డీటీడీవో ప్రేమకళ మంగళవారం పరిశీలించారు. మధ్యాహ్న భోజన ఆహార పదార్థాలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులు కష్టపడి చదివి టెన్త్ ఫలితాల్లో 10 జీపీఏ సాధించాలని సూచించారు. విద్యతోనే సమాజంలో గౌరవం దక్కుతుందని హితవు పలికారు. అలాగే ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. ఈమేరకు హెల్త్ కార్డుల పంపిణీని పర్యవేక్షించారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ బి.వాసు, జయరాం, హరిచంద్, రాములు, రాజయ్య, శత్రు, ఉపేందర్, పరమేశ్వర్, సారయ్య, స్వరూప, కవిత, స్వాతి, భిక్కు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లీ.. దారిద్ర్యం

- పూర్తిగా దెబ్బతిన్న ఘన్‌పూర్, శివునిపల్లి రోడ్లు
- గుంతల రోడ్లతో వాహనదారుల ఇక్కట్లు
- అంతర్గత రోడ్లదీ ఇదే దుస్థితి..
- మునిసిపాలిటీగామారి ఏడాదైనా మారని వైనం..
- పాలకులు, అధికారుల తీరుపై పట్టణవాసుల ఆగ్రహం

8లో


శివునిపల్లి ఆర్వోబీ టౌన్ అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పడ్డ గుంత

గత పాలనలో ఆర్థిక విధ్వంసం

● రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

రేగొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : లక్షల కోట్ల అప్పు చేసిన గత పాలకులు రాష్ట్రాన్ని ఆర్థిక విధ్వంసం చేశారని పశు సంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన గాలికుంటు నివారణ వ్యాక్సినేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరయ్యారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 3కోట్ల 24లక్షల పశువులు ఉండగా ఇప్పటికే 54 లక్షల టీకాలను పూర్తి చేశామన్నారు. రాష్ట్రంలో గాలికుంటు వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మత్స్య శాఖకు ప్రభుత్వం రూ. 123 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. తాము చేస్తున్న అభివృద్ధిని చూడలేక ప్రతిపక్షాలు అవాకులు చెవాకులు మాట్లాడుతున్నాయని విమర్శించారు. ఈసారి వరి కొనుగోలు చేసిన సమయంలో బోనస్ కూడా వెంటనే బ్యాంకు ఖాతాలో జమ చేస్తామన్నారు. సన్నం బియ్యం పంపిణీ చేసి రేషన్ బియ్యం దళారుల చేతికి వెళ్లకుండా కట్టడి చేశామన్నారు. తన వంతుగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలో క్రీడా ప్రాంగణం, ఏదేని రెండు మండలాలకు రెండు వైద్యశాలలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా పశువైద్యాధికారి కుమారస్వామి, తహసీల్దార్ శ్వేత, మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ విజ్ఞన్‌రావు, కోటంచ ఆలయ చైర్మన్ భిక్షపతి, కాంగ్రెస్ నాయకులు నర్సయ్య, మోడెం ఉమేష్‌గౌడ్, ఏనుగు రవీందర్‌రెడ్డి, ఎడ్ల మల్లారెడ్డి, పున్నం రవి, మేకల భిక్షపతి, గండి తిరుపతిగౌడ్, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి


ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న నాగారం గ్రామస్థులు

ఖాళీ బిందెలతో గ్రామస్థుల నిరసన

వాజేడు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వాజేడు మండలంలోని నాగారం గ్రామస్థులు ఖాళీ బిందెలతో మంగళవారం నిరసనకు దిగారు. 20 రోజులుగా నీళ్లు రావడం లేదని, దీంతో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై సుమారు గంట పాటు రాస్తారోకో చేశారు. మిషన్ భగీరథ నీటిని సరఫరా చేసే మోటార్ల మరమ్మతులకు గురైనా అధికారులు పట్టించుకోవడం లేదని, దీంతో గుక్కెడు నీళ్లు కూడా దొరకడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం స్నానం చేయటానికి కూడా నీళ్లు దొరకడం లేదని అన్నారు. వీరి ఆందోళనకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెనుమల్లు రామకృష్ణారెడ్డి మద్దతు పలికారు. గ్రామస్థులు రాస్తారోకో చేస్తున్నారని తెలుసుకున్న ఎంపీవో శ్రీకాంత్ నాయుడు అక్కడికి చేరుకొని వారితో మాట్లాడారు. చెడిపోయిన రెండు మోటార్లకు మరమ్మతులు చేయించి, బుధవారం కల్లా నీటి సరఫరాను పునరుద్ధిస్తామని ఆయన హామీ ఇవ్వడంతో గ్రామస్థులు శాంతించారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డగించిన రైతులు


అధికారులతో వాగ్వాదం చేస్తున్న రైతులు

బచ్చన్నపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పోచన్నపేట వాగు నుంచి ఇసుకను తీసుకెళ్లడంతో తమ భూములు దెబ్బతింటున్నాయని మంగళవారం గ్రామానికి చెందిన రైతులు ఇసుక ట్రాక్టర్లను అడ్డగించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రభుత్వం ఇసుకను వాగుల నుంచి తీసుకెళ్లేందుకు అనుమతులను ఇవ్వగా, ట్రాక్టర్ల యజమానులు ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతూ పంటలను నాశనం చేస్తున్నారని వాపోయారు. అధికారులు ఒక ట్రిప్పుకు అనుమతులిస్తే, కూపన్‌పై రెండు, మూడు ట్రిప్పులు అక్రమంగా నడుపుతున్నారని ఆరోపించారు. విషయం తెలిసి ఎంఆర్ఐ వంశీకృష్ణతో పాటు పలువురు రెవెన్యూ సిబ్బంది వాగు వద్దకెళ్లి రైతులకు నచ్చజెప్పారు. అక్రమంగా ఇసుక తీసుకెళుతున్నట్టు తమ దృష్టికి తీసుకువస్తే వాహనాలు సీజ్ చేస్తామన్నారు. కూపన్‌లు ఇచ్చిన ట్రాక్టర్లలో ఇసుక తరలింపును అడ్డుకోవద్దని సూచించారు.

గంజాయి మత్తులో యువకుడి హల్‌చల్

జనగామ రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గంజాయి మత్తుల్లో ఓ యువకుడు జనగామలో హల్‌చల్ చేశాడు. జిల్లా కేంద్రంలోని అమ్మబావి సమీపంలో ఓ యువకుడు గంజాయి, మద్యం సేవించి రోడ్డుపై వెళ్తున్న బాటసారులకు కత్తితో బెదిరిస్తూ భయాందోళనకు గురిచేశాడు. మత్తులో బాటసారులపై దాడికి యత్నించిన యువకుడిని స్థానిక యువకులు చితకబాది పోలీసులకు అప్పగించారు. జనగామ పోలీసులు యువకుడిడి అదుపులోకి తీసుకున్నారు. స్థానికులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది వైరల్‌గా మారింది.


యువకుడిని చితకబాదుతున్న స్థానికులు


రుద్రాభిషేకం కార్యక్రమంలో బ్రాహ్మణులు

ఆది ముక్తీశ్వర స్వామికి రుద్రాభిషేకం

మహదేవపూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి అనుబంధ ఆలయమైన ఆదిముక్తీశ్వర ఆలయంలో స్వామి వారికి మంగళవారం లఘున్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆలయ ప్రాంగణంలో వనభోజనాలు నిర్వహించి దామోదర స్వరూపమైన ఉసిరిక చెట్టుకు పూజలు నిర్వహించారు.

కాలసర్ప దోష నివారణ పూజలు

కాళేశ్వరముక్తీశ్వర స్వామి ఆలయంలో మంగళవారం కాలసర్పదోష నివారణ పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కాలసర్పదోష నివారణ పూజలతో పాటు నవగ్రహ పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

సైకాలజీ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ప్రభుత్వ ఉపాధ్యాయ విద్యాకళాశాల (బీఈడీ)లో ఖాళీగా ఉన్న సైకాలజీ అతిథి అధ్యాపక పోస్టును తాత్కాలిక విధానం ద్వారా భర్తీ చేసేందుకు అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గెస్ట్ లెక్చర్ ఎంపిక సమయానికి అభ్యర్థి 65 ఏళ్ల లోపు వయసు కలిగి రిటైర్డ్ లేదా నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థికి నెలకు రూ.23,400 గౌరవ వేతనంగా ఇవ్వనున్నట్లు తెలిపారు.

అభ్యర్థి ఎంఏ, లేదా ఎంఎస్‌సీ సైకాలజీ, ఎంఈడీ విద్యార్హతలు కలిగి ఉండాలన్నారు. పూర్తి చేసిన వ్యక్తిగత వివరాలను ఫొటోతో జత చేసి కళాశాలలో సంబంధిత దరఖాస్తును పూరించి విద్యార్హతలకు సంబంధించిన నిజప్రతులతో ఈనెల 30 నుంచి నవంబరు 3లోగా సమర్పించాలని, నవంబరు 6వ తేదీన తుది జాబితా ప్రకటిస్తామని, 10వ తేదీన మెరిట్ ప్రాతిపదికన 1:5 నిష్పత్తిలో డెమో లేదా ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు అబ్దుల్‌హై తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను 11న ప్రకటించనున్నట్టు తెలిపారు. ఎంపికైన అభ్యర్థి ఆదే రోజు బీఈడీ కళాశాలలో రిపోర్టు చేయాలన్నారు.

వరంగల్ రైల్వేస్టేషన్‌లో దొంగ అరెస్ట్

గిర్మాజిపేట, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ రైల్వే పోలీసులు మంగళవారం దొంగను అరెస్టు చేసి అతడి వద్ద బంగారం స్వాధీనం చేసుకున్నారు. భద్రతా చర్యల్లో భాగంగా ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు మంగళవారం ఉదయం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారాలపై తనిఖీ చేస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని తనిఖీ చేశారు. అతడి వద్ద 11 గ్రాముల బంగారు ఆభరణాలు లభించడంతో జీఆర్‌పీకి తరలించి విచారణ జరిపారు. తను హైదరాబాద్ చార్మినార్ జంగంమెట్ ప్రాంతానికి చెందిన చందునాయక్‌గా నిర్ధారించారు. తాను వరంగల్ రైల్వేస్టేషన్‌లో షిరిడి ఎక్స్‌ప్రెస్‌లో ఈ ఆభరణాలు దొంగిలించినట్లు అంగీకరించడంతో వెంటనే కాజీపేట రైల్వేకోర్టులో రిమాండ్ చేశారు. ఆభరణాల విలువ రు. లక్ష 30 వేల రుపాయలు ఉంటుందని జీఆర్‌పీ సీఐ సురేందర్ తెలిపారు. తనిఖీల్లో ఆర్‌పీఎఫ్ ఏఎస్సై పి.దుర్గాప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్స్ ఎస్.శ్రీనివాస్, ఎ.ఏడుకొండలు, ఎస్.రమేష్, జీఆర్‌పీ కానిస్టేబుల్ డి.రాము పాల్గొన్నారు.

31న డీఎంహెచ్‌వో కార్యాలయం ముట్టడి

ములుగు రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 31న ములుగు డీఈవో కార్యాలయాన్ని ముట్టడించనున్నట్టు మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. పలు సమస్యలపై ఇన్‌చార్జి డీఈవో ఎ.సిద్ధార్థరెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ వంట కార్మికులకు తొమ్మిది నెలలుగా బిల్లులు, వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వంట కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గున్నాల రాజకుమారి, మాలగాని కమలక్క, పౌర రాధ, రేవూరి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రమేష్



స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఛాగల్ గ్రామానికి చెందిన, స్టేషన్ ఘన్‌పూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకం రమేష్ అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అనంత రెడ్డి చేతుల మీదుగా మంగళవారం నియామకపత్రం అందుకున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో అసోసియేషన్ బలోపేతానికి, ఈ ప్రాంత అడ్వకేట్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తనకు పదవి రావడానికి సహకరించిన జిల్లా అడ్వకేట్స్, స్టేషన్‌ఘన్‌పూర్ బార్ అసోసియేషన్ బాధ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

యువతి అదృశ్యం

కేసు నమోదు


అదృశ్యమైన దివ్య

చిలుపూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కంప్యూటర్ శిక్షణ కోసం వెళ్లిన 27ఏళ్ల యువతి అదృశ్యమైన ఘటన జనగామ జిల్లా చిలుపూర్ మండలం కృష్ణాజీగూడెంలో జరిగింది. మంగళవారం ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన ఎర్రబెల్లి సుశీల -కొమురయ్య దంపతుల కుమార్తె దివ్య హన్మకొండలోని ఓ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి ఇంటివద్దనే ఉంటోంది. కొద్ది రోజులుగా కంప్యూటర్ శిక్షణ తీసుకుంటున్న దివ్య సోమవారం హన్మకొండకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వాకబు చేసినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసంక్రమిత వ్యాధులను గుర్తించాలి

భూపాలపల్లి డీఎంహెచ్‌వో మధుసూదన్

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వైద్య పరీక్షలు ముమ్మరం చేసి, అసంక్రమిత వ్యాధులను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని వైద్యాధికారులను డీఎంహెచ్‌వో మధుసూదన్ ఆదేశించారు. మల్టీ లెవల్ హెల్త్ పర్సన్‌తో మంగళవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అసంక్రమిత వ్యాధుల (నాన్ కమ్యూనికేబుల్ డిసీజ్) స్క్రీనింగ్‌ను త్వరగా పూర్తి చేయాలన్నారు. మాతా శిశు ఆరోగ్య పరిరక్షణలో భాగంగా గర్భిణులకు షెడ్యూల్ ప్రకారం పరీక్షలు చేయించాలని అన్నారు. జిల్లాలో పలిమెల, మహాముత్తారం మండలాల్లో గిరిజన, ఆదివాసీల జనాభా ఎక్కువగా ఉన్న దృష్ట్యా ఆది కర్మయోగి అనే కార్యక్రమాన్ని నిర్వహించి చికిత్స చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీదేవి, ప్రోగ్రాం అధికారి ఉమాదేవి, ప్రమోద్ కుమార్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశం మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో మధుసూదన్

పాదయాత్రలను విజయవంతం చేయాలి

మేరా యువ భారత్ వరంగల్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్



సమావేశంలో మాట్లాడుతున్న అన్వేష్

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : సర్దార్ వల్లభ్ భాయి పటేల్ 150వ జయంతి సందర్భంగా కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ పాదయాత్రలను చేపట్టినట్లు మేరా యువ భారత్ వరంగల్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ తెలిపారు. వాటిని విజయవంతం చేయాలని కోరారు. భూపాలపల్లి పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత దేశం ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పడం, ప్రజా స్వామ్య అంశాలను పరిష్కరించడంతో పాటు దేశం కోసం పాటుపడిన త్యాగధనులను స్మరిస్తూ ఘనంగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు భూపాలపల్లి జిల్లాలో పాదయాత్రలను చేపట్టనున్నామని అన్నారు. ఈ కార్యక్రమాలు ఈ నెల 31 నుంచి నవంబరు 25 వరకు కొనసాగుతాయని తెలిపారు. సమావేశంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రఘు, కేంద్ర సమాచార శాఖ, ప్రసార మంత్రిత్వ శాఖ ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి శ్రీధర్, ఎన్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు గొలుసు చోరీ నిందితుడి అరెస్ట్

కాజీపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో ఓ మహిళ మెడల్లోంచి బంగారు గొలుసును చోరీ చేసిన నిందితుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కాజీపేట రైల్వే ఎస్సై ఎం.అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం.. డోర్నకల్‌కు చెందిన కె.విజయ సెప్టెంబరు 18న సింగరేణి రైల్లో డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో రైలెక్కి రామగుండం వెళ్తుంది. రైలు కాజీపేట టౌన్ స్టేషన్‌లోకి రాగానే ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బాధితురాలి మెడల్లోంచి 22 గ్రాముల రెండు వరసల బంగారు పుస్తెల తాడును లాక్కెళ్లారు. ఆమె ఫిర్యాదుతో రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి సీసీ కెమెరాలు, స్పెక్ట్రా మిషన్ టవర్‌డెటా ఆధారంగా కోమటిపల్లి గ్రామం, కేసముద్రం మండలానికి చెందిన నామాల నవీన్‌గా గుర్తించారు. నిందితుడు మంగళవారం కాజీపేట రైల్వే స్టేషన్‌లో ఉన్నట్లు గమనించిన పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. నిందితుడి నుంచి బంగారు గొలుసు, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ బంగారం ఆభరణాల విలువ రూ. 2 లక్షల 50 వేలు ఉంటుందని పోలీసులు చెప్పారు. ఈ కేసును ఛేదించిన ఎస్సై ఎం. అభినవ్, పోలీస్ సిబ్బందిని రైల్వే సీఐ వడ్డే నరేశ్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఛటర్జీ, డీఎస్పీ కృపాకర్, ఎంస్పీ చందన దీప్తి అభినందించారు.

కల్లుగీత కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలి

● 8న జిల్లా మహాసభను విజయవంతం చేయాలి

గోవిందరావుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికులు సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని, ఇందులో భాగంగా నవంబరు 8వతేదీన ములుగులో నిర్వహించనున్న జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రవిగౌడ్, జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాసగౌడ్ అన్నారు. మండల కేంద్రంలో సంఘం మండల కమిటీ సమావేశం కాసగాని స్వామిగౌడ్ అధ్యక్షతన జరగగా వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. 25ఏళ్ల నుంచి ఏజెన్సీలో వృత్తిచేసుకుని జీవిస్తున్న కల్లుగీత కార్మికులకు ఎటువంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి సొసైటీలను పునరుద్ధరించాలని, సంక్షేమ పథకాలు అందించాలన్నారు.

అదేవిధంగా గీతకార్మికులందరికీ గుర్తింపుకార్డులు, వృత్తి పింఛన్ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రుద్రబోయిన మల్లేష్, కార్యదర్శిగా వత్సవాయి సారయ్య, గౌరవ అధ్యక్షుడిగా రాఘవులు, ప్రధాన కార్యదర్శిగా బండపల్లి సాంబయ్య, సహాయ కార్యదర్శిగా చౌగాని అంజనేయులు, ఉపాధ్యక్షులుగా మెరుగు సుధాకర్, జక్కు వేణుగోపాల్, జక్కు రాజు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో పంజాల శ్రీనివాస్, రంగు సత్యనారాయణ, కాసగాని భిక్షం, మద్దెల ఐలుమల్లు, కక్కెర్ల శ్రీనివాస్, జక్కు రాజమొగిలి, పెరుమాండ్ల మొగిలి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఏటూరునాగారం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ములుగు డీఎంహెచ్‌వో గోపాల్‌రావు అన్నారు. ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో జరుగు తున్న ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సమస్యలతో వచ్చిన మహిళలకు అందుతున్న వైద్య సేవల తీరును అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ఈ కార్యక్రమం ప్రాముఖ్యతను గ్రామస్థాయిలో మహిళలకు వివరించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పోషకాహార ప్రోగ్రాం అధికారి శ్రీకాంత్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల నియంత్రణాధికారి రణధీర్, రొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుమలత, మానిటరీ సూపర్‌వైజర్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ముట్టడిని విజయవంతం చేయాలి

వెంకటాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నవంబరు 3వతేదీన నిర్వహించే చలో ఏటూరునాగారం ఐటీడీఏ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల జేఏసీ చైర్మన్ పూనెం శ్రీను పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మండలంలోని ఉప్పేడు, గొల్లగూడెం, తుర్సవానిగూడెం గ్రామాల్లో పర్యటించి ముట్టడి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఐటీడీఏ ముట్టడి కార్యక్రమానికి ఆదివాసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

వెంకటాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మేరా యువ భారత్ వరంగల్ కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 30,31 తేదీల్లో వెంకటాపురం మండల కేంద్రంలోని కాఫేడ్ క్రీడా మైదానంలో నిర్వహించే వెంకటాపురం, వాజేడు మండలాల బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌ను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ కోఆర్డినేటర్ నవీన్ యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న 15నుంచి 29ఏళ్ల యువత ఈనెల 28,29 తేదీల్లోపు 9553782024, 8897675741 నంబర్ల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా పురుషలకు వాలీబాల్, మహిళలకు టగ్ ఆఫ్ వార్, పురుషులు, మహిళలకు అథ్లెటిక్స్ (100 మీటర్ల పరుగు పందెం), బ్యాడ్మింటన్(సింగిల్ షటిల్స్) ఉంటాయని తెలిపారు. పూర్తి వివరాలకు 7013346852, 9553782024 నంబర్లను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

చలో ఏటూరునాగారాన్ని జయప్రదం చేయాలి

గూడూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : నవంబర్ 3న జరిగే చలో ఏటూరునాగారం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మహబూబాబాద్ జిల్లా నాయకులు తాటి సుధాకర్ పిలుపునిచ్చారు. గూడూరు మండలంలోని పలు గ్రామాలను తెలంగాణ ఆదివాసీ ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలన్నారు. ఏటూరు నాగారం వై జంక్షన్ నుంచి ఐటీడీఏ ఎదుట నిర్వహించే మహా ధర్నా కార్యక్రమానికి ఆదివాసీలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	6900	5300
మక్కలు	1920	1521
కందులు	6229	3022
పెసళ్లు	4052	3022
పల్లికాయ (సూక)	4000	3500
పల్లికాయ (పచ్చిది)	----	----
పసుపు (కాడి)	----	----
పసుపు (గోల)	----	----
తేజ మిర్చి	12000	9500
తేజ ఏసీ	----	----
వండర్‌హాట్	----	----
వండర్‌హాట్ ఏసీ	16300	12000
యూఎస్341ఏసీ	16300	9000
దీపిక	----	----
సింగిల్‌పట్టి ఏసీ	----	----
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

ఇంకెన్నాళ్లు ఈ పడవ ప్రయాణం?

- వ్యవసాయం చేయాలంటే ఇలా అర చేతిలో ప్రాణం పెట్టుకోని వెళ్లాల్సిందే మరీ..
- అదుపు తప్పితే ప్రమాదమే...
- ఎనబై ఏళ్లుగా నరకం అనుభవిస్తున్నరైతులు
- ప్రభుత్వాలు మారినా పట్టించుకోని పాలకులు

దంతాలపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓ వాగు సమీపాన శివారు పల్లె ఉంది. అపల్లె వాసులు పడరాని పాట్లు పడుతూ నిత్యం అరచేతిలో ప్రాణం పెట్టి కాలం వెళ్లదీస్తున్నారు. స్వాంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఎన్నో ప్రభుత్వాలు మారినా ఈ రైతన్నల కన్నీటి గాథ వినే నాథుడే కరువయ్యారు. ఎక్కడో మహా అడవిలో ఉండే ప్రజల బాధల కంటే.. వీరి వ్యథ వినలేనిది. చూడరానిది. వివరాల్లోకి వెళ్లితే..

మహబూబాబాద్‌లోని దంతాలపల్లి మండలం ఉమ్మడి ఆగపేట శివారు నూతనంగా ఏర్పడ్డ రామవరం గ్రామ పంచాయతీ. గ్రామాల పునర్విభజనలో భాగంగా ఏర్పడ్డ రామవరంలో 170 కుటుంబాలున్నాయి. ఇక్కడ వివిధ కులస్తులుంటారు. వీరి వృత్తి ముఖ్యంగా వ్యవసాయం పైనే ఆధారపడి ఉంది. వీరు 1930లో మండలంలోని పెద్దముప్పారం గ్రామం నుంచి వలస వచ్చినట్టు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ గ్రామం సమీపంలో ప్రసిద్ధి చెందిన పాలేరు వాగు ఉంది. ఈ వాగు ఇరువైపులా సుమారు 120 మంది రైతులకు 230 ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. సాగుకోసం ప్రతీ వర్షాకాలం సమయంలో పాలేరు వాగు ప్రవహించే సమయంలో వాగు వెంబడి రైతులు పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కొందరు వాగు దాటేందుకు పడవ సహాయం, తెప్ప సహాయంతో వివిధ పనులకు వెళ్తూ కాలం వెళ్లదీస్తున్నారు. మరీ భాగా వర్షాలు వచ్చినప్పుడు వారాల కొద్ది పొలాలను వదిలేసి ఊర్లోనే ఉంటారు. ఈ వాగు దాటేందుకు ఉపయోగిస్తున్న తెప్ప, పడవలు ఒడ్డు దాటే క్రమంలో అదమరిస్తే ప్రమాదం పొంచి ఉంది. సుమారు ఈ పాలేరు వాగు అర కిలో మీటర్ల దూరం పొడవునా ఉండడంతో రైతులు గుంపులు గుంపులుగా ఒకరి చేతులు మరొకరు పట్టుకుంటూ లోతైన వాగు గుండా వ్యవసాయ పనులకు వెళ్లతున్నారు. ఇలా పలుమార్లు భారీ వర్షం సమయంలో ప్రమాదంలో ఓ యువకుడు 2015లో మృతి చెందాడు. 10 పశువులు సైతం నీటిలో కొట్టుకుపోయాయి. గతంలో పాలేరు ఉధృతికి ట్రాక్టర్లు, రైతులకు సంబంధించిన పరికరాలు సైతం వాగులో కొట్టుకోపోయాయి. ఈ గ్రామ ప్రజలు మండలంలోని పెద్దముప్పారం గ్రామాలకు వెళ్లాలంటే ఆగపేట శివారులోని తండాల నుంచి 7కిలో మీటర్ల దూరం గుండా ప్రయాణం చేయాలి. పాలేరు వాగుపై బ్రిడ్జి నిర్మిస్తే కేవలం ఒక కిలో మీటరు దూరంతోనే పెద్దముప్పారానికి 40 కిలోమీటర్లలో సూర్యాపేటకు చేరుకోవచ్చు. పలుమార్లు ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా ఫలితం లేదని పేర్కొంటున్నారు రామవరం పల్లెవాసులు. ప్రభుత్వాలు మారుతన్నా వీరి బతుకుల్లో వెలుగు లేక రైతన్నలు పడరాని పాట్లు పడుతున్నారు.



ప్రమాదకరంగా ప్రవహిస్తున్న పాలేరు వాగును తెప్ప సహాయంతో దాటుతున్న మహిళా రైతు పగిడిపల్లి ధనమ్మ, రైతు పగిడిపల్లి బాబు

బ్రిడ్జి నిర్మాణం చేయాలి

రామవరం ప్రజలకు బ్రిడ్జిలేకపోవడంతోనే పలుమార్లు మృత్యువాత సంభవించాయి. నాయకులు పట్టించుకోకపోవడంతోనే తాము వ్యవసాయానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గతంలో చాలా మంది తెప్పతో వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. గ్రామానికి చెందిన పొడుపుగంటి వెంకటయ్య, బొల్ల శ్రీనివాస్‌లు నీటి ప్రవాహానికి కొట్టుకోపాయారు. పొలం పనులకు వెళ్లాలంటే తెప్పలు, చిన్న చిన్న నాటు పడువలు ఉపయోగిస్తున్నాం. నాయకులు, అధికారులు స్పందించాలి. ప్రస్తుత ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ బ్రిడ్జి నిర్మాణానికి హామీ ఇచ్చినా కల సాకారం కలేదన్నారు.



- మాలోతు హరిశ్చందర్‌నాయక్, రైతు, దుబ్బతండా శివారు, రామవరం

ఎన్‌పీడీసీఎల్‌కు ప్రతిష్ఠాత్మకమైన సర్టిఫికెట్లు

రాంనగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్‌పీడీసీఎల్‌కు ప్రతిష్ఠాత్మకమైన రెండు అత్యుత్తమైన ఐఎస్‌వో సర్టిఫికెట్లు లభించాయి. మంగళవారం ఖమ్మంలోని మధిరలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతుల మీదుగా సీఎండీ వరుణ్‌రెడ్డి సర్టిఫికెట్లను అందుకున్నారు. విద్యుత్ పంపిణీ కార్యక్రమాలు, సబ్‌స్టేషన్‌ల నిర్వహణ, సబ్‌స్టేషన్‌ల నిర్మాణాల్లో అత్యుత్తమ నాణ్యతను గుర్తిస్తూ క్వాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ సర్టిఫికెట్లు ప్రదానం చేయగా, ఉద్యోగుల భద్రతపై అనునిత్యం తీసుకుంటున్న చర్యలకుగాను సంస్థ అనుసరిస్తున్న సురక్షా ప్రమాణాలను గుర్తిస్తూ ఆక్యూపేషనల్, హెల్త్‌అండ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ ప్రతిష్ఠాకమైన సర్టిఫికెట్ల ను హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ జారీ చేసింది. తెలంగాణలో మొదటిసారిగా ఐఎస్‌వో సర్టిఫికెట్‌లను ఎన్‌పీడీసీఎల్ పొందడం గర్వకారణంగా ఉందని సీఎండీ వరుణ్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.



డిప్యూటీ సీఎం భట్టి చేతుల మీదిగా సర్టిఫికెట్ అందుకుంటున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

సామాజిక తెలంగాణే లక్ష్యం



ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాగృతి నేతలు

- తెలంగాణ జాగృతి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మాధవి
- నవంబరు 8, 9న వరంగల్ జిల్లాలో 'జాగృతి జనం బాట'

వడ్డెపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : సామాజిక తెలంగాణే తమ లక్ష్యమని తెలంగాణ జాగృతి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మారేపల్లి మాధవి అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. చారిత్రక నేపథ్యం కలిగిన వరంగల్ జిల్లాలోని ఖిలా వరంగల్ కోట, భద్రకాళి, వేయిస్తంభాల దేవాలయాలను కల్వకుంట్ల కవిత సందర్శించనున్నట్లు వెల్లడించారు. వరంగల్ జిల్లాలో నవంబరు 8, 9న నిర్వహించే జాగృతి జనం బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు మాట్లాడుతూ.. వరంగల్, హనుమకొండ జిల్లాలోని మేధావులు, ప్రొఫెసర్లు, న్యాయవాదులు, డాక్టర్లు, ఇంజనీర్లు, జర్నలిస్టులతో పాటు వివిధ కుల సంఘాల నాయకులను కల్వకుంట్ల కవిత కలిసి జనం బాటలో మమేకం కావాలని కోరినట్లు చెప్పారు.

జాగృతి రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీకాంత్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కొనేందుకే తెలంగాణ జాగృతి ఆవిర్భవించిందని పేర్కొన్నారు. జాగృతి జనం బాటకు సంబంధించిన పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జాగృతి నేతలు కూతాడి కుమారస్వామి, ఓని సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ఐ క్రీడా ఎంపిక పోటీలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 500మంది హాజరు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) అండర్-19 ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్‌ఎస్)లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్-19 బాలబాలికల క్రీడా ఎంపిక పోటీలు రెండో రోజు జోరుగా ప్రారంభమయ్యాయి. మంగళవారం జేఎన్‌ఎస్‌లోని హ్యాండ్‌బాల్ కోర్టులో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి బాలబాలికల హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలను ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి నరెడ్ల శ్రీధర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. .నాలుగు రోజులు క్రీడా పోటీల నిర్వహణలో భాగంగా రెండోరోజు హ్యాండ్‌బాల్, చెస్, షటిల్ బ్యాడ్మింటన్, హాకీ, బెల్ట్, రెజ్లింగ్, సైక్లింగ్, స్కేటింగ్, బేస్‌బాల్, బీచ్ వాలీబాల్ క్రీడాంశాల్లో పోటీల ను నిర్వహించగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 500మంది క్రీడా కారులు పాల్గొన్నరన్నారు. కాగా, హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చెస్, ములుగు రోడ్డులోని ఎల్బీ కళాశాల క్రీడా మైదానంలో షటిల్ బ్యాడ్మింటన్, వరంగల్ సీకేఎం కళాశాల మైదానంలో సైక్లింగ్ పోటీలను నిర్వహించామన్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఎంపిక పోటీల్లో పలు జిల్లాల నుంచి బాలబాలికలు హాజరై గెలుపే లక్ష్యంగా లక్ష్యసాధన కోసం చమటోడ్చుతున్నారు. ఈ కార్యక్ర మంలో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ (ఎస్ఏపీఈటీఏ) జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు ఎ.ప్రభాకర్ రెడ్డి, కుమార్, గౌరవ అధ్యక్షుడు దేవేందర్, ఎస్ఏపీఈటీఏలు రవీందర్, రాముడు, జన్ను బాబు, ప్రేం ప్రసాద్, తెలంగాణ రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ కార్యవర్గసభ్యుడు మర్కాల యాదిరెడ్డి, వివిధ జిల్లాకు చెందిన ఎస్ఏపీఈటీలు, పీడీలు కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



హ్యాండ్‌బాల్ పోటీలో తలపడుతున్న వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

అగ్రంపహాడ్ జాతరను ఘనంగా నిర్వహించాలి

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి
- జాతర ఏర్పాట్లపై సమీక్షలో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రంపహాడ్‌ను మినీ మేడారంగా పిలిచే సమ్మక్క- సారలమ్మ జాతరను ఈసారి ఘనంగా నిర్వహించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఈ జాతర ఏర్పాట్లపై అధికారులతో గద్దెల వద్ద ఎమ్మెల్యే సమీక్షించారు. ముందుగా అమ్మవారి గద్దెల వద్ద వన దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పలు ఆదేశాలు జారీ చేశారు. జాతరలో అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అమ్మవార్లను గద్దెలపైకి తీసుకొచ్చే సమయంలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహించాలని సూచించారు. తాగునీరు, క్లోరినేషన్, 108 వాహనం అందుబాటులో ఉంచడం, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. భక్తుల వాహనాలు పార్కింగ్ చేయడానికి స్థలం, చలువ పందిళ్లు, క్యూలు, భోజన సౌకర్యం, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయడం తదితర అంశాలపై చర్చించారు. చేతి పంపులు, బోర్ల మరమ్మతు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు, రోడ్లపక్కన చెట్లను తొలగించి సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీటి ఏర్పాటు, జాతర ప్రాంగణం, వాహనాల పార్కింగ్ స్థలం, అమ్మవార్ల గద్దెల చుట్టూ లైటింగ్, డెకరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా జరగాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

ఈ సమావేశంలో పరకాల ఆర్డీవో పి.నారాయణ, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఆర్.సునీత, జాతర ఈవో నాగేశ్వర్‌రావు, అన్ని శాఖల అధికారులతో పాటు ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బీరం సుందన సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్, జాతర మాజీ చైర్మన్ బొరిగం స్వామి, తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, పోలీసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఒకరి దుర్మరణం

ఖమ్మం రహదారిపై ఘటన

మామునూరు అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. మంగళవారం సాయంత్రం వరంగల్ నాయుడు పెట్రోల్ బంక్ వద్ద లారీ ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. ఖిలా వరంగల్‌కు చెందిన ఇమ్మనేని లక్ష్మణ్‌రావు (48) ఇటుక బట్టీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.

మంగళవారం సమీప బంధువుల అంతక్రియలకు వెళ్ళి వచ్చిన ఆయన పెట్రోల్ బంక్ వద్ద బైక్‌పై రోడ్డు దాటుతుండగా కాకినాడకు చెందిన 14 టైర్ల లారీ ఖమ్మం వైపు వెళ్తూ ఢీకొట్టింది. లారీ ముందుటైరు అతడిపై తలపై నుంచి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని అంబులెన్స్ ద్వారా ఎంజీఎంకు తరలించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలంలో లక్ష్మణ్‌రావు మృతదేహం

ఆలయాలను అభివృద్ధి చేయండి..

- చిల్పూర్, జీడికల్ గుళ్లకు రూ.10కోట్లు కేటాయించాలి
- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి కడియం వినతి

హనుమకొండ, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలోని అతి ప్రాచీనమైన, చారిత్రకంగా సుప్రసిద్ధమైన దేవాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ చేనేత భవన్‌లోని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కార్యాలయంలో స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ఆలయాల అభివృద్ధిపై దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, ఇతర అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అతి ప్రాచీనమైన, ప్రాముఖ్యత గల ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ముఖ్యంగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం పరిధిలోని చిల్పూర్ శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.5కోట్లతో మాస్టర్ ప్లాన్ రూపొందించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఆలయ ఆవరణలో ఉన్న ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ అర్చకుల నియామకానికి సంబంధించిన ఫైల్ పెండింగ్‌లో ఉందని, వెంటనే ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. జీడికల్ రామచంద్ర స్వామి ఆలయ అభివృద్ధికి సైతం రూ.5కోట్లతో మాస్టర్ ప్లాన్ రూపొందించి ప్రతిపా దనలు సిద్ధం చేయాలని అన్నారు.వచ్చే నెల 4నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. నవాబ్‌పేట కోదండ రామస్వామి ఆలయ అభివృద్ధికి సంబంధించిన రూ.1.03 కోట్ల అభివృద్ధి పనులను మంజూరు ఇవ్వాలని కోరారు. ఆలయ ఆవరణలో ప్రహరీ నిర్మాణంతో పాటు కోతుల బెడద అధికంగా ఉన్నందువల్ల సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే స్టేషన్‌ఘన్‌పూర్ పట్టణ కేంద్రంలో కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు తిరుమలనాథ స్వామి ఆలయానికి సంబంధించిన 1.09ఎకరాల దేవాదాయ శాఖ భూమి అన్యాక్రాంతం కాకుండా మున్సిపాలిటీకి లీజుకు అనుమతి ఇవ్వాలని కోరారు. మున్సిపాలి టీకి లీజుకు ఇవ్వడం ద్వారా ఆలయ భూమిని రక్షించడంతో పాటు ప్రజలకు ఉపయోగకరంగా మారుతుందని తెలిపారు. నియోజకవర్గం పరిధిలోని జీడికల్ రామ చంద్ర స్వామి ఆలయం, చిల్పూర్ బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయం, స్టేషన్ ఘనపూర్ తిరుమలనాథ స్వామి ఆలయం, చిన్నపెండ్యాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయాలకు చెందిన భూముల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. దేవాదాయ శాఖ భూములు అన్యాక్రాంతం, ఆక్రమణలకు గురి కాకుండా సర్వే చేసి హద్దులు నాటడంతో పాటు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో దేవాదాయశాఖ జాయింట్ కమిషనర్ రామక్రిష్ణారావు, చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మెన్ పొట్లపల్లి శ్రీదర్ రావు, ఇతర దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతి పత్రం అందజేస్తున్న కడియం

స్టడీ అవర్‌లో విద్యార్థినికి అస్వస్థత

వెంకట్రాంపురం ఉన్నత పాఠశాల్లో ఘటన

బయ్యారం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుడు చదవమని వారించగా.. స్టడీ అవర్‌లో ఓ విద్యార్థిని అస్వస్థతకు గురైన ఘటన మానుకోట జిల్లా బయ్యారం మండలంలోని వెంకట్రాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పాఠశాల నందు చోక్లాతండాకు చెందిన సంగీత అనే విద్యార్థిని 8వ తరగతి చదువుతోంది. ఎస్ఏ-1 పరీక్షల ప్రిపరేషన్‌లో భాగంగా పాఠశాలలో మధ్యాహ్న సమయంలో నిర్వహించిన స్టడీ అవర్‌లో సదరు విద్యార్థిని అస్వస్థతకు గురైంది. దీంతో విద్యార్థినిని చికిత్స నిమిత్తం బయ్యారంలోని ఓ ఆస్పత్రికి తీసుకొచ్చినట్లు సమాచారం.

అనంతరం విషయాన్ని తల్లిదండ్రులకు తెలపగా వారు జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. ఈ విషయమై పాఠశాల హెచ్‌ఎం లింగరాజును వివరణ కోరగా.. స్టడీ అవర్‌లో తెలుగు ఉపాధ్యాయుడు చదవమని అనడంతో విద్యార్థిని అస్వస్థతకు గురైందన్నారు. తొలుత బయ్యారంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స నిర్వహించిన అనంతరం తల్లిదండ్రులు జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.



ఉపాధ్యాయుడి అసభ్యకర ప్రవర్తనపై విచారణ చేస్తున్న ఎంఈవో వెంకటేశ్వరరావు

ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడిపై విచారణ

- పాఠశాల నుంచి తొలగింపు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడు విద్యార్థిని పట్ల ఉపాధ్యాయుడి అసభ్యకర ప్రవర్తనపై ఎంఈవో మంగళవారం విచారణ చేపట్టారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యన భ్యసిస్తున్న ఓవిద్యారినిపై పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు ఈనెల 25న అసభ్యకరంగా ప్రవర్తించాడనే విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. 26న ఆదివారం కావడంతో ఈ నెల 27న పాఠశాలకు వచ్చి సదరు ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేసినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న డీఎస్ఎఫ్ఐ నాయకులు పాఠశాలకు చేరుకొని మంగళవారం సంబంధిత జిల్లా, ఎంఈవోకు తెలిపి నిరసన వ్యక్తం చేశారు. పాఠశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఎంఈవో వెంకటేశ్వర రావును వివరణ కోరగా విచారణ చేపట్టి పూర్తి నివేదికను డీఈవోకు నివేదించనున్నట్లు పేర్కొన్నారు.

తల్లీకూతుళ్ల అదృశ్యం

గీసుగొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : 15వ డివిజన్ మొగిలిచర్లలో తల్లి, కూతుళ్ల అదృశ్యమైన ఘటన మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొగిలిచర్ల గ్రామంలో సెహరూన్ (31) ఆమె కూమార్తెలు సహిస్తా (9), సానియా (6)లు ఈ నెల 27 ఇంటి నుంచి బయటికి వెళ్లి కనిపించకుండా పోయారని సెహరూన్ భర్త షాహిద్‌ఖాన్ ఫిర్యాదు చేశారు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విశ్వేశ్వర్ తెలిపారు. కాగా, ఈ నెల 27న బొడ్డుచింతలపల్లిలో ఉమసత్యదుర్గ అనే వివాహిత, గొర్రెకుంటలో బీటెక్ విద్యార్థిని శాతరాసి శ్యామలత అదృశ్యమైనట్లు వారి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇది ఇలా ఉండగా గత మూడు నెలల్లో 10 మంది వరకు అదృశ్యమైన కేసులు నమోదు కావటం గమనార్హం.



అదృశ్యమైన తల్లి సెహరూర్, కుమార్తె

రబీ సాగు సాఫీగా సాగాలి : కలెక్టర్

జనగామ రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రబీ సాగు సాఫీగా సాగాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రబీ సాగు నేపథ్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ అధికారులు, ఫర్టిలైజర్ షాపు యాజమానులు, డీలర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ యాసంగిలో రైతులకు సమయానికి సరైన పద్ధతిలో ఎరువులు అందాలన్నారు. గ్రామాలను సమీపంలోని ఎరువుల దుకాణాలకు ట్యాగ్ చేసి నియంత్రణ పంపిణీ వ్యవస్థను అమలు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోని తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ధాన్యం కొనుగోళ్లు

లింగాలఘణపురం (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టామని, దీంతో ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయని కలెక్టర్ వెల్లడించారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తుఫాన్ నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అవసరమైన టార్పాలిన్లను అందుబాటులో ఉంచామన్నారు. ప్రతీ సెంటర్‌ను ఆన్‌లైన్ చేయడం జరిగిందని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగ్ చేసిన మిల్లులకు వెంటనే తరలించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, ఎంపీవో రఘురామకృష్ణ, పీఏసీఎస్ సీఈవో శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

నవంబరు 7నుంచి చెకుముకి పోటీలు



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ కల్చరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి చెకుముకి పోటీలు నవంబరు 7నుంచి నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రిజ్వాన్ బాషా చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్-25 గోడ పత్రికను ఆవిష్కరించారు. శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు బానోతు రవీందర్, ప్రధాన కార్యదర్శి అనంతోజు ఉమాదేవిలు మాట్లాడుతూ ఈ పోటీలతో విద్యార్థుల్లో సైన్స్‌పై అభిరుచి పెంపొందించవచ్చన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లోని 8,9,10 తరగతులు విద్యార్థులు పాల్గొనాలన్నారు. నవంబరు 7న పాఠశాల స్థాయిలో, 21న మండల స్థాయిలో, 28న జిల్లా స్థాయిలో, డిసెంబరు 12, 13, 14 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో కరీంనగర్ జిల్లాలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రశ్నపత్రాలు కావాల్సిన వారు 93464 02030, 99893 54662 సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా బాధ్యులు కె.ఎల్.మల్లారెడ్డి, రసాల బాలరాజు, బండోజు శ్రీనివాస్‌చారి, సానికె సత్తయ్య, గోపు శోభన్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రమదానంతో రోడ్లకు మరమ్మతు



జఫర్‌గఢ్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గుంతలమయమైన రోడ్లను సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శ్రమదానం చేసి మట్టితో మంగళవారం పూడ్చివేశారు. జఫర్‌గఢ్‌లో పలు చోట్ల రహదారులు గుంతలతో అధ్వానంగా ఉండడంతో సీపీఎం కార్యకర్తలు మంగళవారం హన్మకొండ దర్వాజా వెళ్లే లోతైన గుంతలు పడిన రోడ్డుపై మట్టిని పోశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య మాట్లాడుతూ అధ్వానంగా ఉన్న గ్రామీణ రోడ్లను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాట సుధాకర్, శ్రీను, సాకి నర్సింగం, తాటికాయల రేణుక, కోమల, భారత లక్ష్మీ, శ్రీను, కొమురయ్య, బంగారు చిరంజీవి, అలీం, రజిత, సిద్ధు, పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను వివరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్ నాయక్

కొడకండ్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రతీ కుటుంబానికి చేరేలా కృషి చేయాలని పాలకుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్ నాయక్ యూత్ కాంగ్రెస్ నాయకులకు సూచించారు. మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు దూదిమెట్ల యాకేష్ అధ్యక్షతన జరిగిన యూత్ కాంగ్రెస్ సమీక్షా సమావేశానికి ముఖ్యఅతిథిగా రాజేష్ పాల్గొని మాట్లాడారు. పథకాలు ప్రజలకు అర్థమయ్యే వివరించాలన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలనే లక్ష్యంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సురేష్ నాయక్, ధర్మారపు భిక్షపతి, మసురం రవీందర్, పసునూరి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పాంనూర్‌లో బీఆర్ఎస్ మండల నాయకుడు కలకోల రమేష్ తండ్రి కలకోల ఎల్లయ్య (59) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, మాజీ ఎమ్మెల్యే రాజయ్య మంగళవారం కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మాచర్ల గణేష్ గౌడ్, నాయకులు కనకం గణేష్, ఒగ్గు రాజు, ఇనుగాల సంపత్ రెడ్డి, డాక్టర్ కరుణాకర్ రెడ్డి, లకావత్ చిరంజీవి, బీరయ్య, మహేందర్ రెడ్డి, నరేందర్, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళిత ఆత్మగౌరవ సభకు తరలిరావాలి..



సమావేశంలో మాట్లాడుతున్న సునీల్

జఫర్‌గఢ్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : సుప్రీంచీఫ్ జస్టిస్‌పై దాడి యత్నాన్ని నిరసిస్తూ 1న హైద్రాబాద్‌లో నిర్వహించే దళితుల ఆత్మగౌరవ నిరసన ప్రదర్శనకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జి బోడ సునీల్ పిలుపునిచ్చారు. మంగళవారం జఫర్‌గఢ్‌లో ఎమార్పీఎస్ మండల అధ్యక్షుడు గాదెపాక మహేందర్ అధ్యక్షతన జరిగిన ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జస్టిస్‌పై దాడి యత్నానికి పాల్పడిన రాకేశ్ కిషోర్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు రడపాక ఆదాం, మండల అధ్యక్షుడు ఇల్లందుల రాంబాబు, జిల్లా నాయకులు గంగాధరి రవిందర్, మారెపల్లి బాబు, ప్రవీణ్, యాకనాథం, టి.యాదగిరి, వెంకన్న, రామస్వామి, కిష్టయ్య పాల్గొన్నారు.



శివునిపల్లిలో ఫైర్ స్టేషన్ రోడ్డులో..



స్టేషన్ ఘన్‌పూర్ గాంధీ చౌరస్తా అండర్ పాస్ వద్ద..



స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వే అండర్ బ్రిడ్జిలో కంకర తేలి..



స్టేషన్ ఘన్‌పూర్ సొసైటీ సీసీ రోడ్డు దుస్థితి

ఇంకెన్నాళ్లీ.. దారిద్ర్యం

● పూర్తిగా దెబ్బతిన్న ఘన్‌పూర్, శివునిపల్లి రోడ్లు

● పాలకులు, అధికారుల తీరుపై పట్టణవాసుల ఆగ్రహం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్టేషన్ ఘన్‌పూర్ మునిసిపాలిటీగా అభివృద్ధి చెంది ఏడాది అవుతున్నా సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు. ముఖ్యంగా రోడ్ల పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది. ఘన్‌పూర్, శివునిపల్లి జంట పట్టణాల్లో ప్రధాన బీటీ రోడ్లు, అంతర్గత రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్ బస్టాండ్ వద్ద సర్వీస్ రోడ్డు, గాంధీ చౌరస్తా వద్ద అండర్ పాస్ కింద రోడ్డు గుంతలమయంగా మారింది. శివునిపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి అంబేద్కర్ సెంటర్ వద్ద రెండు మూడేళ్లుగా బీటీ రోడ్డుపై గుంతలు పడ్డాయి. దీంతో వాన పడితే రోడ్డు మధ్యలోనే నీరు నిలిచి కుంటలా మారి, వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద సీసీ రోడ్డు మరీ ఘోరంగా మారింది. సీసీ కొట్టుకుపోయి కంకర తేలి ప్రమాదకరంగా తయారైంది.

శివునిపల్లి పట్టణ ఫైర్ స్టేషన్‌కు ఎదురుగా రోడ్డును క్రాస్ చేస్తు వేసిన డ్రైనేజీ పైప్‌లైన్ పగిలిపోయి గుంతలు ఏర్పడ్డాయి. నెలలు గడుస్తున్నా దీన్ని మరమ్మతు చేసే వారు లేక ప్రమాదాలకు నిలయంగా మారుతోంది.

సీసీ రోడ్లదీ అదే దుస్థితి..

ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లో ఏళ్ల క్రితం వేసిన సీసీ రోడ్లు కూడా అధ్వానంగా మారాయి. సీసీ రోడ్లు లేని చోట మట్టి రోడ్లను, మెటల్ రోడ్లను కొత్తగా సీసీ రోడ్లుగా వేస్తున్నారే తప్ప పాత సీసీ రోడ్లను పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. మండల ఆఫీసు రోడ్డు నుంచి పీఏసీఎస్ మీదుగా బస్టాండ్ రోడ్డు సీసీ రోడ్డు కంకర తేలి, గుంతలమయంగా మారిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు వేసి 20ఏళ్ల అవుతున్నా, నిత్యం రద్దీగా ఉన్నా మరమ్మతులకు మాత్రం నోచుకోవడం లేదు. ఎస్సీ కాలనీలో పాత సీసీ రోడ్లు రెండు, మూడు చోట్ల అధ్వానంగా మారింది.

పోలీసుల సేవలు మరువలేనివి



జనగామలో ఓపెన్ హౌస్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తం

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

ఘనంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవం

జనగామ రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు మరువలేనివని, ఇందుకోసం నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పనిచేస్తున్నారని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జనగామలో మంగళవారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పోలీసులు తమ కుటుంబ క్షేమం కన్నా సమాజ క్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్నారని అభినందించారు. కార్యక్రమంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏసీపీ పండారి చేతన్ నితిన్, సీఐ సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఓపెన్ హౌస్

పాలకుర్తి(ఆంధ్రజ్యోతి): పోలీస్‌అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయుధాలు, తుపాకులు, సమాచార వ్యవస్థ, రక్షణ కోసం ఉపయోగించే పరికరాలపై విద్యార్థులకు సీఐ జానకిరాంరెడ్డి అవగాహన కల్పించారు. వాటి అక్రమ రవాణాకు పాల్పడినా, విక్రయించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సైబర్ నేరాల బారిన పడిన వారు 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు దూలం పవన్‌కుమార్, లింగారెడ్డి, సిబ్బంది సోమిరెడ్డి, రవీందర్, సంపత్‌కుమార్, కానిస్టేబుళ్లు, యాకన్న, అశ్విని, ప్రశాంత్, రోహిత్ ఉన్నారు.

చిలుపూర్‌లో ఓపెన్‌హౌస్

చిలుపూర్(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలను కాపాడడంలో భాగంగా ప్రతీ ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ సూచించారు. పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పోలీస్‌స్టేషన్లో ఓపెన్‌హౌస్ నిర్వహించారు. ఈమేరకు కేజీబీవీ విద్యార్థులకు ఆయుధాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది కుమారస్వామి, వీరన్న, రమాదేవి, ఇంద్రాచారి, శ్రీనాథ్, నరోత్తమ్‌తోపాటు, కేజీబీవీ ఎస్‌వో ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.



జనగామలో ఓపెన్ హౌస్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

ఎంజీఎంకు కొత్త బాస్

సూరింటెండెంట్‌గా డాక్టర్ పి.హరీష్ చంద్రారెడ్డి

వరంగల్ మెడికల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ పింగిళి హరీష్ చంద్రారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిష్టినా మంగళవారం జీవో ఆర్‌టీ నెంబర్ 506 విడుదల చేశారు. ప్రస్తుతం హరీష్ చంద్రారెడ్డి మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనను ఎంజీఎం ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

కరీంగనగర్ జిల్లా హుజురాబాద్ మండలం పోతిరెడ్డిపేటకు చెందిన హరీష్ చంద్రారెడ్డి.. 1987-1993లో కాకతీయ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. 1996లో హైదరాబాద్ గాంధీ మెడికల్ కళాశాలలో ఈఎన్‌టీ పీజీ పూర్తి చేశారు. కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యాధికారిగా విధులు నిర్వర్తించారు. 2002లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి ఈఎన్‌టీ విభాగంలో ట్యూటర్‌గా పదోన్నతి పొందారు. 2003 నుంచి 2017 వరకు ఎంజీఎం ఆస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించి, 2017లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా నిజామాబాద్‌కు బదిలీ అయ్యారు. 2021 నుంచి మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో ఈఎన్‌టీ విభాగం ప్రొఫెసర్‌గా సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. హరీష్ చంద్రారెడ్డి శుక్రవారం ఎంజీఎంలో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

కాగా, ఇప్పటివరకు సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ కిశోర్‌ను పదవి నుంచి ప్రభుత్వం తొలగించడం చర్చనీయాంశంగా మారింది. కొన్నిరోజులుగా ఎంజీఎంలో జరుగుతున్న వరుస సంఘటనలపై రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ సీరియస్ కావడంతో వేటు పడినట్లు చెబుతున్నారు.

నిర్వహణ లోపాలు, పరిపా లన వైఫల్యాలు, రోగులకు సరైన వైద్యసేవలు అందకపోవడం, వైద్యు లు సమయపాలన పాటించకపోవడం తదితర అంశాలు డాక్టర్ కిశో ర్‌ను తొలగించేందుకు కారణాలుగా నిలిచాయని చెబుతున్నారు. నూతన సూపరింటెండెంట్ అయినా ఎంజీఎం పాలనను గాడిలో పెట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



నజీరుద్దీన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సాగుపై అవగాహన కల్పించాలి

చిలుపూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రానున్న రబీ సాగుకు సంబంధించి లాభదాయకమైన పంటలపై రైతులకు అవగాహన కల్పించేలా వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం చిలుపూర్‌లో ఏవో ఎమ్డీ నజీరుద్దీన్, ఏఈవో వినయ్ కుమార్‌లకు వినతిపత్రం అందజేశారు. రమేష్ మాట్లాడుతూ గతంలో సీజన్ల వారీ పంటల సాగుతోపాటు, ఎరువులు, విత్తన సబ్సిడీలపై అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించేవారని, ప్రస్తుతం వాటిని తుంగలో తొక్కారన్నారు. కార్యక్రమంలో ఊరడి లింగయ్య, మూడికె భీమయ్య, సాదం రామరాజు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

పాలకుర్తి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతులు పశువులకు టీకాలు వేయించి గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాలకుర్తి పశువైద్యాధికారి అశోక్ సూచించారు. మండలంలోని బమ్మెరలో పశువైద్య శిబిరం నిర్వహించి 420 పశు వులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో గోపాలమిత్ర తదితరులు ఉన్నారు.

నిర్మాణాలు ఆపాలని ఆదేశం

కొడకండ్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమించి చేపడుతున్న నిర్మాణాలను వెంటనే ఆపాలని తహసీల్దార్ చంద్రమోహన్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. సర్వే నెంబరు 100లో ఆయన పరిశీలించారు. మొత్తం 346.20గుంటల ప్రభుత్వ భూమి ఉండగా, గతంలో వీఆర్వోలకు కమిటీ హాల్ నిర్మాణం కోసం 10గుంటలు కేటాయించారు. మండలానికి చెందిన అందే యాకయ్య అనే వ్యక్తి వీఆర్వోలకు కేటాయించిన 10గుంటలు ఆక్రమించినట్లు రెవెన్యూ అధికారులకు సమాచారం అందడంతో తహసీల్దార్ సిబ్బందితో పరిశీలించి, యాకయ్య ఇప్పటికే ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించినట్లు గుర్తించారు. దీంతో పనులను వెంటనే ఆపేయాలని ఆదేశించారు.

సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాములు

జనగామ రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. జనగామలో మంగళవారం యూనియన్ జిల్లా మూడో మహాసభను సంఘ జిల్లా అధ్యక్షుడు జోగు ప్రకాశ్ అధ్యక్షతన జరిగింది. రాములు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని, ప్రమాద మరణానికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, సహజ మరణానికి రూ.2లక్షలు, సీఎస్‌సీ హెల్త్ టెస్టులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాపర్తి రాజు, వెంకటేశ్, మల్లేశ్, సంపత్, మధు, భిక్షపతి, మహేశ్ పాల్గొన్నారు.

సొసైటీల అభివృద్ధే లక్ష్యం

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్ సొసైటీల అభివృద్ధే లక్ష్యంగా కార్యాచరణ ఉండాలని నాబార్డు ఏజీఎం రవి తెలిపారు. అంతర్జాతీయ సహకార సంఘాల దినోత్సవంలో భాగంగా మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రవి మాట్లాడుతూ సొసైటీల ఆధ్వర్యంలో మార్ట్‌లను, పెట్రోల్ పంప్‌లను, మెడికల్ షాపులను, రహదారు వెంట ప్లాట్లను కొనుగోలు చేసి, భవనాలు నిర్మించి రెంట్‌లకు ఇచ్చి వాటి ద్వారా ఎక్కువ ఆదాయం రావడంతో సొసైటీలు బలోపేతం అవుతాయన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల నరేందర్ రెడ్డి, డీసీసీ బ్యాంకు మేనేజర్ మహబూబీ, సిబ్బంది రమణ, సీఈవో మగ్దుంఅలీ, డైరెక్టర్ చింత ఎల్లయ్య, తోట అంజయ్య, పీఏసీఎస్ సిబ్బంది రాంప్రసాద్, కార్తీక్ రాజు, మతీన్‌అలీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవి



జనగామలో కార్తీక దీపాలంకరణలో భక్తులు

ఘనంగా కార్తీక దీపోత్సవం

జనగామ కల్చరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): శివకేశవులకు ప్రీతికరమైన కార్తీక మాసం సందర్భంగా జిల్లాలో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. మంగళవారం జనగామలోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో కార్తీక దీపాలంకరణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పూజారి మారుపాక శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులు దీపోత్సవంలో పాల్గొని తన్మయులయ్యారు. మట్టి ప్రమిదల్లో దీపాలు వెలిగించిన భక్తుల హర నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగిపోయింది. పూజల అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామి వారి కటాక్షాన్ని అందుకున్నారు.

వేంకన్నకు సువర్ణ పుష్పార్చన

చిలుపూర్(ఆంధ్రజ్యోతి): అష్టదళ పాదపద్మారాధన పూజను పురస్కరించుకుని చిలుపూర్ గుట్ట బుగులు వేంకన్న ఆలయంలో మంగళవారం సువర్ణ పుష్పార్చన చేపట్టారు. దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఈవో భాగం లక్ష్మీప్రసన్న స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం 108 సువర్ణ పుష్పాలను స్వామివారి పాదాలకు అలంకరించారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాగుతున్న రాజు

రఘునాథపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కాలరాస్తూ కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ముఖ్యకార్యకర్తల సమావేశంలో రాజు మాట్లాడారు. అనంతరం సీఐటీయూ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా పొదల నాగరాజు, సభ్యులుగా కడారి ఆంజనేయులు, మద్దూరి యాదగిరి, ఉమ్మగోని రాజేష్ ఎన్నికయ్యారు. సమావేశంలో బైరగోని బాలయ్య, శాడ వెంకటయ్య, గంగాపురం మహేందర్, కడారి ఐలయ్య, వీరస్వామి, సాయిప్రసాద్, రాజు, ఎల్లయ్య పాల్గొన్నారు.

మొంథా చింత!

(5వ పేజీ తరువాయి)

సుమారుగా 2లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు, పొలంలోనే ఉందని అధికారులు చెబుతున్నారు. దీని బట్టి ఇంకా కోతలు పెద్ద ఎత్తున జరగాల్సి ఉందని తెలుస్తోంది. వానాకాలం సీజన్ ఆరంభంలో జిల్లాలో సాగునీటి ఎద్దడి ఏర్పడింది. చెరువుల్లోకి గోదావరి జలాలు ఆలస్యంగా రావడంతో రైతులు ఆచితూచి వరి సాగు చేశారు. దీంతో నాట్లు ఆలస్యమయ్యాయి. ఈ క్రమంలో కోతలు కూడా ఆలస్యం అవుతున్నాయి. ఈ సమయంలో వర్షాలు పడితే వరి నేలకొరగడం, గింజలు రాలే ప్రమాదం ఉంది. అంతేకాదు, వర్షాలతో హార్వెస్టర్ యంత్రాలు చేలల్లోకి వెళ్లలేక కోతలు ఆలస్యమై గింజలు రాలుతాయి. ఒకవేళ వర్షం పడితే చేనుపై ఉన్న పత్తి తడిసి నల్లబారే ప్రమాదం ఉంటుంది. అంతే కాకుండా భారీ వర్షాలు కాయ పగిలి ఉన్న పత్తి వర్షాలకు నేల రాలుతుంది. దీంతో పెద్ద ఎత్తున నష్టం జరుగుతుంది.

రైతులు అప్రమత్తం

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తమవుతున్నారు. వరి కోత లకు సమయం ఉన్నప్పటికీ త్వరత్వరగా కోస్తున్నారు. పత్తి రైతులు సైతం కూలీలను ఎక్కువ మొత్తంలో మాట్లాడుకొని పత్తిని తీస్తున్నారు. తుఫా న్ వల్ల రెండు, మూడు ఏకధాటిగా వర్షం పడితే పెద్ద మొత్తంలో నష్టం జ రిగే అవకాశం ఉంటుంది. దీంతో రైతులు ముందస్తుగా జాగ్రత్త పడుతున్నా రు. తుఫాన్ భయంతో కొందరు రైతులు ఏకంగా వడ్లను మిల్లులకు తరలిం చి పచ్చిమీదనే అమ్ముకుంటున్నారు. వరి, మొక్కజొన్న కోతలు పూర్తయిన రైతులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల కారణంగా వ్యవసాయ కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉంది. దీంతో తేమశాతం పెరిగి కొనుగోళ్లు మరింత ఆలస్యమవుతాయని ఆందోళన చెందుతున్నారు.